# అభివృద్ధి వెలుగుల్లో.. గజ్యానాయక్ తండా

- రూ.27కోట్లతో పనులు
- పన్నుల వసూళ్లలో ముందంజ
- విద్యుత్ సమస్యలు పరిష్కారం..

**రూ.27కోట్లతో అభివృద్ధి పనులు**

| | |
|---|---|
| రైతు వేదిక | రూ.22లక్షలు |
| వైకుంఠధామం | రూ.12.60లక్షలు |
| కంపోస్టు షెడ్డు | రూ.2.50లక్షలు |
| డ్రైనేజీల నిర్మాణం | రూ.13లక్షలు |
| బతుకమ్మ ఘాట్ | రూ.3.80లక్షలు |
| హైమాస్ట్ లైట్లు | రూ.1.40లక్షలు |
| పంచాయతీ ట్రాక్టర్ | రూ.10లక్షలు |
| హనుమాన్ ఆలయ ప్రహరీ | రూ.15లక్షలు |
| సీసీ రోడ్డు నిర్మాణం | రూ.26లక్షలు |
| జీపీ భవనం | రూ.20లక్షలు |
| ఫిష్ మార్కెట్ | రూ.10లక్షలు |
| నాలుగు వరుసల రోడ్డు | రూ.14కోట్లు |
| విద్యుత్ సబ్ స్టేషన్ | రూ.కోటీ65లక్షలు |
| అంతర్గత సీసీ రోడ్లు | రూ.కోటీ11లక్షలు |
| అక్కాపూర్ వెళ్లే దారిలో ఫోర్‌లైన్ రోడ్డు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్ | రూ.2కోట్లు |
| ఇతర అభివృద్ధి పనులు | రూ.65లక్షలు |

మాచారెడ్డి, డిసెంబర్ 14: ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా,ఎక్స్‌రోడ్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రగతి పథంలో దూసుకెళ్తున్నది. అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టడంతోపాటు పన్నుల వసూళ్లలో ముందు వరుసలో ఉంటూ అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. కొత్తగా ఏర్పాటైన జీపీ అయినా.. ఐదేండ్లలోనే అభివృద్ధిలో అగ్రభాగాన నిలువడం విశేషం.

**నూతన జీపీతో ముమ్మరంగా అభివృద్ధి..**

గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామం ఒకప్పుడు మాచారెడ్డి మండల కేంద్ర పరిధిలో ఉండేది. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన జీపీల్లో ఎక్స్‌రోడ్‌ను గజ్యానాయక్‌తండాతో కలిపి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో సర్పంచుగా ఎన్నికైన హంజీనాయక్.. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు.

**పన్ను వసూళ్లలో ముందంజ**

గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామం పూర్తిగా వ్యాపార, వాణిజ్య సముదాయాలతో కూడుకొని ఉన్నది. ట్రేడ్ లైసెన్స్‌తోపాటు ఇంటి పన్నులు ప్రతి సంవత్సరం వందశాతం వసూలవుతున్నాయి. దీంతో గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూరుతున్నాయి.



అక్కాపూర్ వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన డివైడర్, సెంట్రల్ లైటింగ్



గ్రామంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్



కార్పొరేట్ హంగులతో జీపీ కార్యాలయం



ఘన్‌పూర్ నుంచి గజ్యానాయక్‌తండా మీదుగా మాచారెడ్డి వరకు ఏర్పాటు చేసిన ఫోర్‌లైన్ రోడ్డు

## విద్యుత్ సమస్యల నుంచి విముక్తి

ఉమ్మడి మాచారెడ్డి జీపీలో ఉన్న సమయంలో గజ్యానాయక్‌తండా,ఎక్స్‌రోడ్ గ్రామానికి నిత్యం విద్యుత్ సమస్యలు ఎదురయ్యేవి. గజ్యానాయక్‌తండా వ్యాపార, వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్నది. ఈ దశలో లోవోల్టేజీ సమస్యలు ఎక్కువయ్యాయి. మాచారెడ్డి, చక్కాపూర్, కొత్తపల్లి, గజ్యానాయక్‌తండా నాలుగు గ్రామాలకు కలిపి ఒకే సబ్‌స్టేషన్ ఉండగా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగు గ్రామాల్లో ఎక్కడ ఎల్‌సీ తీసుకున్నా కరెంట్ సరఫరా నిలిచిపోయేది. సమస్యను అప్పటి విప్ గంపగోవర్ధన్, ఎంపీపీ నర్సింగ్‌రావు సహకారంతో వరంగల్‌లోని ఎన్పీడీసీఎల్ ఆపరేషనల్ డైరెక్టర్‌ను కలిసి వివరించారు. అదే సమయంలో జిల్లాకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆ వెంటనే నిధుల విడుదల, నిర్మాణం చకచకా జరిగాయి. ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ సరఫరాతో స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



### నంబర్ వన్‌గా తీర్చిదిద్దా..

మాజీ విప్ గంప గోవర్ధన్ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా. దాదాపు రూ.27కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాను. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలకు పుష్కలంగా నిధులు వచ్చాయి. మండలంలో ఏ గ్రామానికి రానన్ని నిధులను మా జీపీకి తీసుకువచ్చి అభివృద్ధిలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దాను.

**- హంజీనాయక్, సర్పంచ్, గజ్యానాయక్‌తండా**

# సంగీత నృత్యాలకు పూర్వవైభవం

- రాష్ట్రంలో అత్యధిక విద్యార్థుల సంగీత పాఠశాలలు గుర్తింపు
- త్వరలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 14: శిశుర్వేత్తి.. పశుర్వేత్తి.. వేత్తి గానరసం ఫణి. చిన్నపిల్లలు, పశువులు, పాములు ఇలా జీవజాలాన్నంతటిని రంజింపచేయగలిగే ధ్వని సంగీతం. గీతం వాద్యం తథా నృత్యం. త్రయం సంగీత ముచ్చతే... రాగం, స్వరం, తాళం అను ఈ మూడింటి చేరికయే సంగీతమని పెద్దలన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు సంగీత నృత్య పాఠాలు నేర్చుకొనే విద్యాసంస్థగా గుర్తింపు పొందింది ఇందూరులోని శ్రీ జ్ఞాన సరస్వతి సంగీత నృత్య పాఠశాల. ఇక్కడ శిక్షణ పొందిన వారు వందల సంఖ్యలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. పరిశోధన రంగంలోనూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగాలు సాధించారు.



సంగీత సాధన చేస్తున్న కళాకారులు

**50 మందితో మొదలై..**

1972లో నిజామాబాద్ నగరంలో సంగీత నృత్య పాఠశాలను స్థాపించారు. మొదట్లో పాలిటెక్నిక్ కళాశాలకు అనుబంధంగా ఉండేది. ప్రత్యేక శాఖగా ఖలీల్‌వాడిలోని అద్దె భవనంలోకి మారింది. సుభాష్‌నగర్‌లో సుమారు పదేండ్లు కొనసాగింది. అప్పటి కలెక్టర్ సీతారామాంజనేయులు ఆదేశాలతో జిల్లా బాల భవన్, అక్కడి నుంచి ఎల్లమ్మగుట్టకు తరలించారు. అనంతరం సుభాష్‌నగర్‌లో 705 గజాల స్థలంలో రూ. 50లక్షలతో నూతనంగా నిర్మించిన భవనంలో శిక్షణ కొనసాగుతున్నది. 50ఏండ్లుగా యువతకు అలంబనగా నిలుస్తున్నది. 50మందితో ప్రారంభమైన ఈ సంగీత నృత్య కళానిలయం.. ప్రస్తుతం 400 మందికి పైగా విద్యార్థులతో అలరారుతున్నది.



**శిక్షణ..**

ప్రస్తుతం ఇక్కడ హిందుస్థానీ, కర్ణాటక గాత్రం, పేరిణి శాస్త్రీయ నృత్యం కోర్సులు మాత్రమే కొనసాగుతున్నాయి. నాలుగేండ్ల ధ్రువపత్రం కోర్సుతోపాటు ఒక సంవత్సరం డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నది. కర్ణాటక గాత్ర సంగీతాన్ని టి. స్వప్నారాణి, హిందుస్థానీ గాత్రం ఎం. అనిత సేవలందిస్తున్నారు. 11 సంవత్సరాల పైబడి 50ఏండ్లలోపు వారంతా ప్రవేశాలు పొందవచ్చు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7గంటల వరకు బోధిస్తున్నారు.

### త్వరలోనే 50ఏండ్ల వేడుకలు..

మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజల కళలను నెరవేర్చడానికి రాష్ట్రంలో ఆరు సంగీత నృత్య విద్యాసంస్థలను ఏర్పాటు చేశారు. సకల కళలకు నిలయమైన ఇందూరు నగరంలో ఈ పాఠశాల స్థాపించి 50ఏండ్లు పూర్తవుతున్నది. సంగీత నృత్య కళలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో భాగంగానే ప్రతినెలా కళా పరిచయాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

**- సరిత, ప్రిన్సిపాల్**

# బాల్యానికి.. భరోసా



ప్రారంభమైన ఓఎస్సీ సర్వే

- 6-14, 15-19ఏండ్ల బాలల గుర్తింపు
- వచ్చే నెల 11 వరకు కొనసాగనున్న సర్వే
- జిల్లా వ్యాప్తంగా 35 మంది గుర్తింపు

కామారెడ్డి, డిసెంబర్ 14: బడీడు పిల్లలకు ప్రాథమిక విద్య దరి చేరాలనే ఉద్దేశంతో విద్యాశాఖ పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. గత కొన్ని రోజులుగా జిల్లాలో బడికి దూరంగా ఉంటూ పనులు చేస్తున్న పిల్లలను బడిలో చేర్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అందరికీ విద్యా అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. (అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్) ఓఎస్సీ సర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమం జనవరి 11వ తేదీ వరకు కొనసాగనున్నది. కామారెడ్డి జిల్లాలో బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తున్నారు. చాలా మంది చిన్నారులు తమ ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. కొందరు వ్యాపారులు సైతం చిన్నారులకు తక్కువ వేతనం ఇచ్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. పుస్తకాలు పట్టాల్సిన బాల్యాన్ని తమ పనులకు ఉపయోగించుకుంటున్నారు. ఇలాంటి వారిని సర్వేలో గుర్తించి యజమానులకు,తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నారు.

**ఉచిత నిర్బంధ విద్య..**

విద్యా హక్కు చట్టం ప్రకారం 14సంవత్సరాల పిల్లలు పాఠశాలలోనే ఉండాలనే లక్ష్యంతో ఓఎస్సీ సర్వే నిర్వహిస్తున్నారు. పాఠశాలలో కాకుండా బయట ఉన్న పిల్లలను చైల్డ్ లేబర్‌గా పరిగణిస్తున్నారు. జనవరి 11వ తేదీ వరకు సీఆర్పీలు చిన్నారుల వివరాలను జిల్లా వ్యాప్తంగా సర్వే ద్వారా సేకరిస్తున్నారు. 6-14, 15-19ఏండ్లలోపు వలస కుటుంబాలకు చెందిన పిల్లలను సైతం సర్వేలో నమోదు చేస్తున్నారు. 15-19 ఏండ్ల పిల్లలు బయట ఉంటే ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతే కాకుండా వారికి రూ.2వేల రీయింబర్స్‌మెంట్‌ను ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు.

**కఠిన చర్యలు..**

18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు హానికర, రసాయన పరిశ్రమల్లో పని చేయకూడదు. గొర్రెలు కాయడం తదితర పనులు నిర్వర్తించకూడదు. అలా ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే యజమానులు, తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కేసులు కూడా పెడతారు.

**ఎప్పటికప్పుడు నివేదిక**

జనవరి 11 వరకు సీఆర్పీలు, ఐఈఆర్పీలు తమ కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో బడిబయట పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాలి. రోజువారీగా గుర్తించిన బడిబయట పిల్లలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. జనవరి 11న మండల స్థాయి బడిబయట సర్వే రిపోర్టును జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. జిల్లా స్థాయిలో పరిశీలించిన బడిబయట పిల్లల వివరాలను జనవరి 12న జిల్లా విద్యాశాఖ అధికారి ధ్రువీకరించి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

### కామారెడ్డిలో 34 మంది గుర్తింపు..

విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వేలో 34 మందిని గుర్తించారు. వివిధ పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులు, యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లల భవిష్యత్తు, చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని అవగాహన కల్పిస్తున్నారు. బాలల విద్య విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశమున్నదని చెబుతున్నారు.

**సర్వే నిర్వహణ ఇలా..**

- సీఆర్పీలు, ఐఈఆర్పీలు తమ కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి ఇంటింటా సర్వే నిర్వహించి బడి బయటి పిల్లలను గుర్తించాలి.
- 6 నుంచి 14, 15 నుంచి 19 ఏండ్ల లోపు బడిబయట పిల్లలను గుర్తించాలి.
- ఆ పిల్లలకు విద్య ప్రాముఖ్యతను వివరించి పాఠశాలల్లో చేర్పించాలి.
- వేరే రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చి పని చేసుకుంటున్న వారి పిల్లల వివరాలు సేకరించాలి.
- డ్రాప్‌బాక్స్‌లోని విద్యార్థులు ప్రస్తుతం ఏ పాఠశాలలో చదువుతున్నారో సమాచారం సేకరించాలి.
- పక్క రాష్ట్రాల్లో ఉండి ప్రస్తుతం సొంత ప్రదేశాలకు వచ్చిన విద్యార్థులను గుర్తించాలి.



చిన్నారులతో పని చేయిస్తున్న యజమానులతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు






బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

### జనవరి 11 వరకు సర్వే..

విద్యా హక్కు చట్టం ప్రకారం 14 ఏండ్ల పిల్లలు పాఠశాలలోనే ఉండాలి. వారిని ఎలాంటి పనుల్లో ఉంచకూడదు. అలా చేసిన యజమానులు, తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. బడీడు పిల్లలను గుర్తించి తల్లిదండ్రులు, యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఈ సర్వే వచ్చే నెల 11 వరకు కొనసాగుతుంది.



**-రాజు, డీఈవో, కామారెడ్డి**